క్లుప్తంగా

నేడు విజయలక్ష్మీనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు విజయలక్ష్మీనగర్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరుకానున్నట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గూడూరులో...

గూడూరు: పట్టణంలోని మూలగేరి, బోయ వీధిలలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెప్మా సీఎంఓ సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, కావున అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

కూలీల సంఖ్య పెంచాలి

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ హసీనా పేర్కొన్నారు. కె.నాగలాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ జిల్లా అధికారులు మండల వ్యాప్తంగా చేపట్టిన ఉపాధి పనులకు రోజుకు 2600 మందికి పని కల్పించాలని లక్ష్యాన్ని విధించారన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా రోజుకు 1300 మంది మాత్రమే కూలీలు హాజరవుతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల హాజరుపై దృష్టి పెట్టి ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని సూచించారు. కూలీల హాజరులో గాని, పని కల్పించడంలో గాని నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొన్నకల్‌లో ఓపెన్ కబడ్డీ పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్‌లో అయ్యకొండ మిన్నెల్లస్వామి ఉరుసును పురస్కరించుకుని ఈ నెల 29 నుంచి 30 వరకు ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ పోటీలకు ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్ర, ఏపీఐడీసీ డైరెక్టర్ హనుమంతరెడ్డి హాజరవుతారన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేత జట్లకు మొదటి బహుమతి రూ.30 వేలను దాత సంధ్యవిక్రమ్‌కుమార్, రెండవ బహుమతి రూ. 20 వేలు మిన్నెల్ల, మూడవ బహుమతి రూ.10 వేలు కౌన్సిలర్ కలాంబాష, సోమేశ్వరరెడ్డి, నాలుగవ బహుమతి రూ.5 వేలు నాగన్న అందిస్తారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఉంటుందని తెలిపారు.

రేపటి నుంచి ఉరుసు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్ అయ్యకొండ మీద వెలసిన మిన్నెల్ల స్వామి ఉరుసు ఉత్సవాలను ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు శుక్రవారం దర్గా పీఠాధిపతి శ్రీ గురు సయ్యద్ అక్బర్‌బాష హుసేని చిస్తి, ముతవల్లి సమ్సుద్దా జబినాబి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న గంధం, 30న ఉరుసు, 31న జియారత్(కిస్తీలు) కార్యక్రమాలను గ్రామ పెద్దలు, ప్రజలు సహకారంతో నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలివచ్చి ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.


జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

కోడుమూరు: అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15వ తేదీన కర్నూలు ఎస్టీయూ కార్యాలయంలో జరుగనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంగస్వామి విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రైవేట్ పరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు, ఉదయ్, జూనైద్ పాల్గొన్నారు.

వెండి పడిగె బహూకరణ



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి పడిగె బహూకరించి పూజ చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 21 కేజీల వెండి పడిగెను భక్తులు అందించినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన శనివారపు వెంకటరామిరెడ్డి, శనివారపు దస్తగిరిరెడ్డి, ఆయన కుమారుడు శనివారపు కొండారెడ్డి, శ్వేత దంపతులు స్వామి వారికి వెండి పడిగెతోపాటు 30 గ్రాముల బంగారు కళ్లు, మీసం బహూకరించారన్నారు. అనంతరం దాతలకు స్వామి సన్నిధిలో పూజలు చేయించి స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం గ్రామ సచివాలయం-2 పరిధిలో గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి తీసుకొని పరిష్కరించేందుకే గడప గడపకు కార్యక్రమం చేపట్టామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని గతంలో ఏ ప్రభుత్వం కూడా నిర్వహించలేదన్నారు. అర్హులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చారన్నారు. దీంతో ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల వల్ల మేలు జరుగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నేతలు ప్రజల ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ పాలన ప్రజల వద్దకు వచ్చిందన్నారు. గతంలో ఏ చిన్న సమస్యకైనా డివిజన్, మండల కేంద్రాల్లోని కార్యాలయాలకు ప్రజలు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం గ్రామ సచివాలయాల వల్ల స్థానికంగా అన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి :

గడప గడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాటసానిని అనంతపురం జిల్లా శ్రీకృష్ణ దేవరాయల అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు కలిశారు. 13 మంది విద్యార్థులు పాణ్యం మండలంలో 3 నెలలపాటు అక్కడి రైతుల వద్ద ఉండి వ్యవసాయంపై అధ్యయనం చేస్తున్నారు. రైతులకు మంచి సలహాలు, సూచనలు ఇచ్చి రిపోర్ట్ తయారు చేస్తారు. అయితే ఎమ్మెల్యే వారిలో మాట్లాడుతూ..రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేసేలా ప్రొత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, కరుణాకరరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, బాలిరెడ్డి, సుబ్రమణ్యం, జితేంద్రారెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, నాయకులు ఎల్లకిట్టు, గౌడ్, సత్యాలు, ఎల్లక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సచివాలయ నిర్మాణం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో చేపట్టిన రెండవ సచివాలయ భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గ్రామంలో 5000 జనాభా ఉండటంతో ప్రభుత్వం రెండు సచివాలయాలను మంజూరు చేసింది. అందులో ఒక సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి అయి వినియోగంలోకి వచ్చింది. రెండవ సచివాలయం నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షల నిధులు మంజూరు చేయగా ప్రస్తుతం భవనానికి సంబంధించి పైకప్పు, ప్లాస్టింగ్, బండ పరుపు ఏర్పాటు వంటి పనులు పూర్తి కాగా పేయింటింగ్‌తో పాటు చిన్నచిన్న పనులు మిగిలిఉన్నాయి. కాంట్రాక్టర్‌తో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని, త్వరలోనే భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పీఆర్ ఏఈ గోపాల్‌రావు తెలిపారు.



ప్లాస్టింగ్ పనులు పూర్తి చేసుకున్న సచివాలయ భవనం

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



అధ్యాపకుడు జయకర్‌రత్నరాజ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ బలరాముడు, పీడీ రాఘవేంద్ర

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జయకర్ రత్నరాజ్‌కు ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు రావడంతో శుక్రవారం ఆయనను సన్మానించారు. గురుకులంలో ప్రిన్సిపాల్ బలరాముడు, వైస్ ప్రిన్సిపాల్ దామోదర్, పీడీ రాఘవేంద్రలతో కలిసి శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జయకర్‌కు జిల్లాలో ఉత్తమ ఇంగ్లిష్ అధ్యాపకుడిగా ఎంపికై గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. అధ్యాపకుడి అవార్డు రావడంతో గురుకుల పాఠశాల, కళాశాలకు గుర్తింపు మరింతగా పెరిగిందనన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేంద్రనాథ్‌సింగ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ అప్లికేషన్లను ఆమోదించాలి



ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న జగనన్న చేదోడు అప్లికేషన్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (న్యూటౌన్): జగనన్న చేదోడు పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన ఆమోదింపజేసి పూర్తి చేయించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న చేదోడు పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ అప్లికేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న చేదోడు మూడవ విడత సాయాన్ని ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుందని తెలిపారు. కావున లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన ఆమోదింపజేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 29 గ్రామాల్లో 180 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ పథకం కింద టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- గీతాముఖర్జీనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గీతాముఖర్జీనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు గీతాముఖర్జీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. 74 ఏళ్ల గణతంత్ర భారతంలో పేదలకు రాజ్యాంగ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సొంతమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్లు, మహిళా చట్టాలు, పేదలకు సంక్షేమ పథకాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అందరికీ అందుబాటులోకి విద్యా, వైద్యం తీసుకొచ్చిన ఘనత జగనన్నకే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ, అభివృద్ధికే ప్రజలు పట్టం కడతారని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా జనం వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు శేషన్న, ఖాజాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



గూడూరు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పడమర బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ప్రజల విన్నవించుకున్న సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్ననే సీఎంగా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్‌ఏ జిలానీ, కౌన్సిలర్లు కలామ్ బాష, ఖలీలు, కుమార్, మద్ది, నాయకులు పత్తి రంగడు, సత్యాలు, బండి రాజు, దండు శ్రీను, క్రాంతి గౌడ్, మున్సిపల్ ఏఈ నరసంహమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు

గూడూరు: గూడూరు పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పాలకమండలి సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ నరసింహమూర్తి, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ప్రధానంగా సమావేశంలో సీసీ రహదారులు, సీసీ డ్రైనేజీలు నిర్మించాలని తీర్మానించారు. 7వ, 15వ వార్డుల కౌన్సిలర్లు రత్నమ్మ, బజారిలు మాట్లాడుతూ తమ వార్డులలో సీసీ రోడ్లు ముందుగా నిర్మించాలని కోరగా.. ప్రాధాన్యత క్రమంలో చేపడుతామని చైర్మన్ తెలిపారు. కౌన్సిలర్ దస్తగిరి మాట్లాడుతూ అజెండా కాపీ తెలుగులో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కలామ్, ఖలీల్, ఉరుకుందమ్మ, బుడ్డంగలి, జ్యోతి, సురేష్, కోఆప్షన్ మెంబర్ మదార్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఓర్వకల్లు: కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై ఓర్వకల్లు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి ఒంటిమిట్టకు ఏపీ 25 ఏసీ 5928 నంబర్ గల కారులో కొంత మంది బయలుదేరారు. నంద్యాల నుంచి కర్నూలుకు ఏపీ 21 బిజి 3778 నంబర్ గల తవేరా ప్యాసింజర్ వాహనంలో కొందరు ప్రయాణికులు వస్తున్నారు. మార్గమధ్యలో ఓర్వకల్లు వద్ద ఫ్లైఓవర్‌పై బర్రెలు అడ్డు రావడంతో ఒంటిమిట్టకు వెళ్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌పై కొంత దూరం వెళ్లింది. అదే సమయంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లోని శ్రీనివాసులు, జ్యోత్స్న, కనికె వెంకటేశ్వర్లు, మల్లకంటి ఈరమ్మ, మఠం మహేశ్వరమ్మ, నిల్లిబండ సుధాకుమారికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు

● మారని అమ్మ ప్రేమ!

ప్రేమను పంచడంలో తల్లి తరువాతే ఎవరైనా... అది మనుషులైనా, జంతువులైనా. సాధారణంగా పంది, కుక్క జాతి వైరం గలవి. అయితే ఆకలితో ఉన్న పంది పిల్లలకు తన పాలిచ్చి ఆకలి తీర్చింది ఓ శునకం. జాతి ఏదైనా అమ్మ ప్రేమ మారదనేందుకు ఈ సంఘటన ప్రత్యక్ష సాక్ష్యం. ఈ దృశ్యం శుక్రవారం కర్నూలు నగరంలోని 21వ వార్డు మహాలక్ష్మి నగర్‌లో చోటు చేసుకోగా సాక్షి కెమెరాకు చిక్కింది. - కల్లూరు



పరిసరాల పరిశుభ్రత పాటించాలి



సి.బెళగల్‌లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం సి.బెళగల్‌లో డెంగీ అనుమానిత కేసు నమోదు కావడంతో అధికారులు, వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగీ అనుమానిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీడీఓ పర్యవేక్షించి పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వేస్ట్ ఆయిల్ బాల్స్‌ను డ్రైనేజీ కాల్వల్లో విడిచారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాముడు, ఎస్‌ఐ పీరయ్య హెచ్చరించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన మంచినీటి బోరు స్థలంను కొంతమంది ఆక్రమించుకోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ, ఎస్‌ఐ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ తదితరులు ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకోవడం నేరమని, ఆక్రమణకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కాగా మంచినీటి వనరుకు అడ్డంగా ఉన్న దుంపలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులను అధికారులు ఆదేశించారు. వీరివెంట ఈఓఆర్డీ సందీప్, గ్రామ సర్పంచ్ పాండురంగన్న, వీఆర్వో శేఖర్ తదితరులు ఉన్నారు.

బొల్లవరంలో 'పల్లెనిద్ర'

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని బొల్లవరం గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్‌ఐ నల్లప్ప, పోలీసు సిబ్బంది పల్లె నిద్ర చేశారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వారానికి ఒక గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. అనవసరంగా గొడవలు పడకూడదని, ప్రశాంతంగా జీవించాలని గ్రామస్తులకు సూచించారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని దంతులు



శ్రీచక్రాన్ని ఫలాలతో అలంకరించిన దృశ్యం

వైభవంగా షష్టి ఉత్సవాలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి(జన్మదిన) వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున నుంచి అర్చకులు స్వామి వారికి శాస్త్రోక్తంగా విశిష్ట పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణమండపంలో ఉత్సవమూర్తులకు ఘనంగా కల్యాణం నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు మహిళలు, భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డిలు కల్యాణంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. షష్టి వేడుకలను పురస్కరించుకొని ఆలయాన్ని పూలు, పండ్లు, మామిడి తోరణాలు, అరటి బొదెలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయ గర్భాలయంలో ఉన్న పైకప్పు శ్రీ చక్రాన్ని ఫలములతో అలంకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఈఓ రామకృష్ణ, అర్చకులు వీరయ్య, నారాయణ, సురేష్ , సుబ్బయ్య, కిట్టయ్య, సర్పంచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీ సుంకులాపరమేశ్వరి దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కూడా వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సోమన్న, గ్రామ పెద్దలు పెద్ద ఈశ్వరయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలను సాగు చేయండి

- డీఏఓ వరలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

కల్లూరు: రైతులు చిరు ధాన్యాల పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం పెద్దటేకూరు రైతు భరోసా కేంద్రం వద్ద చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని, వాటి సాగు ఆవశ్యకతను రైతులు తెలుసుకోవాలన్నారు. రైతులు పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందుతుందన్నారు. డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించేందుకు మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించడంతో నేల సారవంతాన్ని కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో డీఏఏటి శాస్త్రవేత్త ప్రసాద్, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఏఓలు శ్రీనివాసరెడ్డి, శశీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఆల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, సర్పంచ్ పద్మావతి, రైతులు పాల్గొన్నారు.